
# ప్లే-బాక్ శ్రీనివాస్ - పి.బి. శ్రీనివాస్



ఎందరో నేపథ్యగాయకులున్నా చిత్రసీమలో ప్రవేశించి, తెలుగు, తమిళ చిత్రసీమలో తనదైన ప్రత్యేకతను చాటుకున్నాడు. ఎందరెందరో కథానాయకులు పాడిన పాటలకు గొంతునెరువునిచ్చాడు. ఆయన గొంతున సరస్వతీనది ప్రవహిస్తుంటుంది. చేతుల నిండా పుస్తకాలు మోయలేనంత బరువుగా ఉంటాయ్.

చిత్రపరిశ్రమలో వచ్చిన మార్పులను గుర్చి ఓర్పుగా, నేర్పుగా చెప్పిన విషయాన్నిందు పొందుపరిచాం:

సినిమాలో సన్నివేశానికి పాటప్రాణంపోస్తుంది. ఆ పాటకు మనం ప్రాణం పోయాలని భావించేవాళ్లం ఆ రోజుల్లో. చక్కటి బాణీ, రసమయమైన రచన, లీనమై సాగే నేపద్యగానం.

వీనులవిందైన వాద్యగోష్ఠి, పాట రికార్డింగుకు ముందు నెలరోజులపాటు పూర్తిస్థాయి ఆర్కెస్ట్రాతో రిహార్సల్స్ చేసేవారం. మొత్తం వాద్యబృందం, గాయనీ గాయకులతో రికార్డింగు మొదలైన తరువాత సంగీత దర్శకులు సంతృప్తి చెందేవరకు పాడటం కొనసాగాల్సిందే. చిన్నవాద్య కళాకారుడు చిన్నపాటి తప్పువాయించినా మొదటి నుండి పాడాల్సిందే. పాటపుట్టిన తొలిరోజుల్లో వసతులు తక్కువ. గాయకులు ఇద్దరూ ఒకే మైక్‌కు పక్కపక్కనే నిలుచుని పాడేవారం. ఆ తరువాత ఒకే మైకుకు రెండువైపులా పాడే వెసులుబాటు ఉండేది. అంటే మైకు ఒకటే, ఎదురెదురుగా నిల్చుని పాడేవాళ్లం. మొదట్లో నేరుగా ఫిలిమ్‌పైనే రికార్డు చేసేవారు. ఎంతో ఏకాగ్రతతో పాడకుంటే ఫిలిమ్‌వృథా, నిర్మాతకు ఎక్కువ ఖర్చు ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఒక్కోసారి టేక్‌లపై టేక్‌లతో తెల్లవారిపోయేది. రికార్డింగు విషయంలో ఆర్టిస్టులు బిజీ అయిపోవడం వల్లనే ట్రాక్ విధానం ప్రవేశించిందని చెప్పవచ్చు. ట్రాక్ విధానం లేని రోజుల్లో... ఒక పాటకు ఎందరు పనిచేస్తారో వారంతా ఒకేసారి రికార్డింగు థియేటరుకు చేరుకునేవారు. డ్యూయట్ పాడేటపుడు గాయకుడు గాయని పోటీపడి గమకాలు, సంగతులు ఒలికించేవారు. గాయకులు ప్రత్యక్షంగా ఉండడటం వల్ల డ్యూయెట్‌లో ఒక ఫీల్, ఎమోషన్ వస్తుంది. నేడు అది పూర్తిగా కరువైంది. అలాగే ట్రాజెడీ పాటల్లో ఆత్మక్షోభ కనపడేది. ట్రాక్ విధానం వల్ల నాతోపాటు ఎవరు పాడుతున్నారో కూడా తెలియదు. వాద్యకళాకారులు ఎవరో తెలియదు. చెవులకు పెట్టి హెడ్‌ఫోన్సులో అన్నీ వినిపిస్తుంటాయి. కళ్లెదురుగా మాత్రం ఎవ్వరూ కనబడరు.



పాట రికార్డింగులో పి.బి.శ్రీనివాస్, సంగీత బృందం

అప్పట్లో ఒక పాట గురించి ఆలోచించేందుకు తగిన సమయం కేటాయించేవారు. ప్రస్తుతం అంతా స్పీడ్. ట్రాక్ రికార్డింగ్, గాత్రమాధుర్యాన్ని అధిగమించే వాయిద్యాల హోరు, రికార్డింగులోని స్పీడ్‌లో ఈనాటి తరానికి ఒక వసతి ఉంది. చిన్నపాటి తప్పులను కనపడనీయకుండా కప్పివుచ్చుకోవచ్చు. గ్రామఫోన్ రికార్డులు మెల్లగా తిరిగేపుడు వాటిపై ఉన్న గీతలు స్పష్టంగా కనబడతాయి. అదే వేగంగా తిరిగితే గీతల స్థానంలో నున్నగా ఉంటుంది. ఇదే నేటి స్పీడ్ సంగీతానికి ఒక ఉదాహరణ. సినీ సంగీతం దారిమళ్ళుతున్న తరుణంలో క్లే వయొలిన్ అనే వాద్యపరికరం ప్రవేశించింది. ఇది చూసేందుకు హార్మోనియం పెట్టెలాగే ఉంటుంది. అయితే ఇందులో అనేక వాద్యపరికరాల శబ్దాన్ని పలికించవచ్చు. కీ బోర్డులపై యమహా అనే పేరుంటుంది. సంస్కృతంలో యమః అంటే యముడు. అనేక వాద్యపరికరాలను మింగేసిన కీ బోర్డు వాటిపట్ల యముడేనని చెప్పేవాడిని.

దాదాపు అందరు సంగీత దర్శకులు నిక్కచ్చిగా వ్యవహరించినా, పెండ్యాల నాగేశ్వరరావుకు పట్టుదల మరీ ఎక్కువ. పాట తను అనుకున్నట్లు రావాల్సిందే. శ్రీ కృష్ణగారడి అనే సినిమాలో నారదుని పాత్రకు ఎంత ఘనడవయ్యా అనే పాటను పాడాను. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన రికార్డింగు... పూర్తయ్యేసరికి రాత్రి రెండు గంటలైంది.

సినీ సంగీతంలో కాలక్రమేణా మార్పులు చోటుచేసుకున్నాయి. ట్రాక్ విధానంతో కళాకారుల మధ్య గ్యాప్ ఏర్పడిపోయింది. పాటలో ఆనాడు ఆర్ట్ ఉండేది. నేడు మెకానికల్ అయిపోయింది. మిషన్‌ను నమ్ముకుంటే ఒక్కోసారి గానమాధుర్యం సంగీతం హోరులో కలసిపోతుంది. సాంకేతిక విలువలపై ఆధారపడటం ఎక్కువైంది. టెక్నిక్ పెరిగినపుడు అదే స్థాయిలో పాటలో క్వాలిటీ పెరగాల్సిందిపోయి తగ్గింది.

దేవుడు కాలమంతా వసంతకాలం చేసి వుండవచ్చు. కానీ ఆరు రుతువులను ఇచ్చాడు. ప్రకృతి ఎప్పటికప్పుడు మారిపోయేలా చేశాడు. దేవుడే మార్పును నిర్దేశించినపుడు మరి సంగీతంలో మార్పు సైతం సహజమే కదా. కాలాన్ని బట్టి సినీపాటల రచన, సంగీతం అన్నీ మారిపోయాయి. మార్పును స్వాగతించినపుడే కొత్తవి పుట్టుకొస్తాయి. ●

# 'చివరికి మిగిలేది' లేదన్న బుచ్చిబాబు 51 సంవత్సరాలే ఉన్నాడు



బుచ్చిబాబుగారి పేరు తలచుకోగానే గుర్తొచ్చేది 'చివరికి మిగిలేది' అనే నవల. ఎన్ని నవలలు తెలుగులో వస్తున్నా కలకాలం నిలిచిపోగల నవల ఈ నవల. నీలంరాజు వేంకటశేషయ్యగారి సంపాదకత్వంలో 1945లో 'నవోదయం'లో ప్రచురితమైంది. నవలను ఆంధ్రదేశానికి అంకితమిచ్చారు. ఈ నవలలో ఆయన చక్కటి మానసిక సంఘర్షణని చిత్రించారు. ఒకాయన 'భారతి'లో ఇది శృంగార నవల. బాన్ చేయాలని రాశారు. బుచ్చిబాబుగారికి కోపం వచ్చింది. ఇకపై ఆంధ్ర పత్రికకు, భారతికి రాయనని భీష్మించుకు కూర్చున్నారు. ఈ విషయం అప్పటి ఆ పత్రికల సంపాదకులు శివలెంక శంభుప్రసాద్‌గారి చెవినబడి 'మీలాంటి రచయితల వల్లే మా పత్రికలు వృద్ధిలోకి వచ్చాయి. దయచేసి మీరు మా పత్రికలకు రాయనన కండి. నేను జరిగిన దానికి క్షమాపణలు చెబుతున్నాను' అంటూ బుచ్చిబాబుగారికి ఉత్తరం రాశారు.

ఆయన కోపం పోయింది. గట్టిగా నవ్వేశారట. భోళానవ్వు ఆయన అలవాటు. 'నేను యజమానిని, రచయితని బ్రతిమాలాల్సిన అవసరం నాకేమిటి?" అని భీష్మిం చుకు కూర్చోక అంతటి ఔదార్యాన్ని ప్రదర్శించడం శంభుప్రసాద్‌గారు లాంటి సంపాద కుల అలవాటు. అప్పట్లో సంపాదకులు రచయితలని అంతగా గౌరవించేవారు.

70కిపైగా కథానికలు రాశారు. 'కథలు ఎలా రాయాలో చెప్పడమంటే నేను కథలు ఎలా రాస్తున్నానో చెప్పడమే అన్నారు. అదీ ఆయన నిజాయితీ.

బుచ్చిబాబు కథానికల్లో శిల్పం గొప్పగా ఉంటుంది. ఒకసారి విశ్వనాథ సత్యనారాయణగారు 'బుచ్చిబాబూ! శిల్పమంతా నీ చేతిలోనే ఉందయ్యా' అని ప్రశంసిం చారు. వర్ణనలు ఎక్కువగా ఉంటాయి. ఆయన చిత్ర కారుడు కావటమే అందుక్కారణమై ఉండవచ్చు!

సహజంగా, విచ్చలవిడిగా పెరిగిపోయిన అడవులు, కొండలు, నదీజలాలు, లోయలు, సెలయేళ్లు అంటే నాకిష్టం. అట్లాంటి ప్రకృతిని వర్ణించడంలో ఎంతో ఆనందం పొందుతాను. అందులో వంతెనలుండ కూడదు. రోడ్లు ఉండకూడదు. వాహనాలు తిరుగ కూడదు అంటారు.

అలాంటి ప్రత్యేక వాతావరణంలో ఎన్నో కథానికలు రాశారు. వాటిలో కొన్ని 'ఎల్లోరాలో ఏకాంతసేవ, అరకులోయలో కూలిన శిఖరం, మామ్‌రాయని కథ' లాంటివి. 'నిరంతరత్రయం, తడిమంటకి పొడినీళ్లు, బీ.కలలోజారిన కన్నీరు, ముష్టినిజం, 4711 టాస్కా కాగితం ముక్కలు గాజు పెంకులు, చీరమడతలు– మరమేకులు– ఇలా ఆయన కథానిక శీర్షికలకు పేర్లు ఉంటాయి.

బుచ్చిబాబు గారిమీద పాశ్చాత్య ప్రభావం ఎక్కువ. ఆ విషయం ఆయన రాసిన ఏ కథానికని చదివినా మనకి అర్థమవుతుంది. అందుకే చైతన్య స్రవంతి లాంటి కొత్త ప్రయోగాలు చేయగలిగారు. 'మామ్‌రాయని కథ'ను రాశారు. బెర్‌ట్రెండ్రసెల్ భావాలు, తన భావాలు దగ్గరగా ఉండడంతో 'చీరమేకులు– మర మడతలు', 'కొత్తొంతిన– పాతనీరు' లాంటి కథానికలు రాసి ఆయనకే అంకితమిచ్చారు. షేక్‌స్పియర్ సాహిత్యం తెలుగువాళ్లకి తెలియజెప్పాలని షేక్‌స్పియర్ సాహిత్య పరామర్శ' అనే గ్రంథాన్ని రాశారు. దీనికి అప్పట్లో రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డ్ వచ్చింది. 'నా అంతరంగ కథనం' అంటూ స్వీయకథయని తను ఇంటర్మీడియట్ చదువు వరకే రాసారు. 51 సంవత్సరాల చిన్నవయసుల్లోనే అనారోగ్యంతో చనిపోవడంతో అది అర్థాంతరంగా ఆగిపోయింది.

రేడియో నాటకానికి తెలుగులో బుచ్చిబాబు ఆద్యులనే చెప్పుకోవాలి. 'చెన్నై ఆకాశవాణి నుంచి 'రాయలు కరుణకృత్యం' అనేవారి నాటకం ప్రసారమైంది. మధ్యలో వ్యాఖ్యానంతో పరిచయ వాక్యాలు, బి.ఎన్.రెడ్డిగారితో చెప్పించారు. రేడియోలో ఆ ప్రక్రియకు మొదలు చేసానని బుచ్చిబాబే చెప్పారు. 'రాయలు కరుణ కృత్యం' నాటకం ఆధారంగానే 'మల్లీశ్వరి' చిత్రం రూపొందింది. బుచ్చిబాబు గారు మార్పులకు ఒప్పుకోకపోవడంతో మూలకథ అని పేరు కూడా లేకుండా ఆ కథతోనే సినిమా తీశారు.

బుచ్చిబాబుగారు చెన్నై ఆకాశవాణిలో పనిచేసేప్పుడే ఎక్కువ నాటికలు, నాటకాలు రాశారు. అప్పట్లోనే కాకినాడ పరిషత్‌లో బుచ్చిబాబుగారి 'ఆత్మవంచన' నాటకాన్ని ప్రదర్శించారు. పృథ్వీరాజ్ కపూర్ ముఖ్య అతిథిగా వచ్చారు. 'ఆత్మవంచన'కి బహుమతి వచ్చింది. ఆ నాటకం ద్వారానే సావిత్రి, పుండరీకాక్షయ్యగారలు స్టేజీకి పరిచయమయ్యారు. ఏదో ఒక ఒరవడిలో పడిపోవడం ఆయన నైజం కాదు. ఎప్పుడూ ఏదో ఒక నూతనత్వం ఉండాలి. ఆకర్షణీయంగా మనసుని రంజింప చేసేటట్లుండాలి. ఆత్మవంచన, ఉత్తమ ఇల్లాలు, దారినపోయే దానయ్య మొదలైన నాటిక, నాటకాల్ని అటు రేడియోలోనూ, ఇటు రంగస్థలంపైనా కూడా మెప్పించారు. సాధారణంగా ప్రసారం కోసం రాసింది, రంగస్థలానికి పనికిరాదనే అభిప్రాయం అప్పట్లో ఉండేది. అది తప్పని బుచ్చిబాబుగారు రుజువు చేశారు" అంటారు ఆయనతో ఆకాశవాణిలో కలిసి పనిచేసిన మల్లాది నరసింహశాస్త్రిగారు.

అందరికీ తలలో నాల్కలా ఉండే బుచ్చిబాబుగారు అతి చిన్న వయసు 51లోనే ఆస్మాతో హైద్రాబాద్‌లోనే మరణించారు. చివరకు మిగిలేది– యని వ్రాసిన ఆయన 'బుచ్చిబాబు' పేరుతోనే పోయారు. 51 సం॥ములు జీవించినా, నూరు సంవత్సరాలు జ్ఞాపకం ఉండే కథలు అందించారు. ●



# శంకరంబాడి సుందరాచారి స్వకీయం

## -'మల్లెపూదండ' కవి పట్ల - మిత్రుడి నివాళి-



**"నా** పుట్టిన రోజు 10-08-1914 అని నాన్న చెప్పారు. ఒక శ్రావణ పూర్ణిమ రోజు నేను ఆలస్యంగా ఇంటికి వచ్చానని ఆవేశించి 'నీకు జందెమెందుకురా? శుద్ధ దండుగ' అని దూషిస్తే నాకు ఒళ్లు మండి నా పైని పాత జందెమును పుటుక్కున తెంచి మా ఇంటి ముందు పండుకుని ఉన్న కుక్క మెడలో వేసి క్షణ మాగకుండా రైల్వేస్టేషనుకు వెళ్లిపోయాను. అక్కడ యాత్రికుల పెట్టెబేడ మోసి వచ్చిన కూలి డబ్బులతో తిండి తీర్థం గడుపుకోవడం మొదలుపెట్టినాను. నాన్న నా ముందే పనిచేయవద్దన్నారు. దానితో తిరుపతికి స్వస్తి చెప్పి, చోళింగిపురం చేరి అక్కడ హోటలులో సప్లయరుగా చేరి, వంటపని కూడా క్షుణ్ణంగా నేర్చుకున్నాను." ఇది మా తెనుగు తల్లికి మల్లెపూదండ' గేయ రచయిత శంకరంబాడి సుందరాచారి జీవిత చరిత్రలోని ఓ శకలం.

అన్నమంతా ఉడికిందా లేదా అని తెలుసుకోవ డానికి ఒక మెతుకు పట్టిచూస్తే చాలు అంటారు. అలాంటి మెతుకే ఈ శకలం. ఆయన జీవితం పొడుగునా ఇదే తిరుగుబాటు తత్త్వం కొనసాగించారు. ఎక్కడా రాజీ పడలేదు. రైల్వేకూలిగా, ఆంధ్రపత్రికలో సబ్ఎడిటరుగా, బెంగుళూరులో ఓ ప్రైవేటు ఉద్యోగిగా, సెకండరీ గ్రేడ్ టీచరుగా, సినిమా స్క్రిప్టురైటర్‌గా, స్కూళ్ల జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్నో ఉద్యోగాలు చేసారు. తేడా రాగానే తృణప్రాయంగా విడిచిపెట్టారు. ఏ సత్కారాలకు, ప్రలోభాలకు అధికార పీఠాలకు లొంగలేదు. ప్రపంచ తొలి తెలుగు మహాసభల సందర్భంగా మధురాంతకం రాజారాం లాంటి రచయితల ఒత్తిడి వల్ల శంకరంబాడి రాసిన 'మా తెనుగు తల్లికి..' గీతాన్ని ప్రభుత్వమే రాష్ట్రజాతీయ గీతంగా ప్రకటించింది. నెలవారీ గౌరవవేతనంగా 250 రూపాయలు కూడా ప్రకటించింది. అది ఎంతవరకు అమలయిందో గాని, అవసాన దశలో కూడూ, గూడూ లేక శిష్యుల సాయంతోనే నెట్టుకొచ్చారాయన. చాలాకాలం చిత్తూరు జిల్లా (తిరుచానూరు జన్మస్థలం)లో స్కూలు స్కూలు తిరిగి తన పుస్తకాలు అమ్మి వచ్చిన కొద్దిపాటి పైకంతో పొట్టుపోసుకున్నారు.

శంకరంబాడి సాహిత్యాన్ని ఆజన్మాంతం ఆరాధించిన ఆయన మిత్రుడు వైకెవిఎన్ ఆచార్య ఆరోగ్యం చెడిపోయినా, పక్షవాతం వచ్చినా 85వ ఏట ఈ రచనకు పూనుకున్నారు. ఏ మాత్రం రచనానుభవంలేని ఆచార్య, తన మిత్రుడి చివరి కోరిక మేరకు, మాట ఇచ్చిన ముప్ఫయి సంవత్సరాల తరువాత రాయలేక రాయలేక రాసిన పుస్తకం ఇది.

సుందరాచారి తమిళవైష్ణవులలో పుట్టినా తెలుగు వారికి జాతీయ గీతాన్ని అందించినవారిగా నిలవడం విశేషం. పేదకవి ఫిరదౌసిని బడిపిల్లలకు పరిచయం చేయాలని తలంపుతో అంతకుముందు ఎందరో రాసి నప్పటికీ ఆ కథను మళ్లీ రాసారు.

తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ, లోక్‌సభ స్పీకర్ అనంతశయనం అయ్యంగార్, ప్రముఖ రచయితలు రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ, రాయప్రోలు, పింగళి లక్ష్మీకాంతం, మేటి నటుడు నాగయ్య ప్రశంసలు పొందినా, పామరుల కోసమే రచనలు సాగించారు. హృదయం చెప్పిన ప్రకారం నడుచుకునే కవులు గతించిన ఈ కాలంలో అలా జీవించిన కవి గురించి మిత్రుడొకరు రచించి ప్రచురించడం అభినందనీయం. ●

## 138 ఏళ్ల తెలుగు నవల - శ్రీరంగరాజు చరిత్ర

138 సంవత్సరాల (1872-2010) కాలంలో వెలువడ్డ 40 వేల తెలుగు నవలల్లోంచి కేవలం వంద నవలల్ని జల్లెడ పట్టడమనేది మేధోశక్తికి ఒక సవాల్. ఈ నవలలను ఒక పరిణామక్రమంలో చెప్పాలి. తెలుగువారి సంస్కృతి, వేష, భాష, ఆహారపు అలవాట్లు, కులమతాచారాలతో, పెండ్లి వేడుకల్లో వచ్చిన మార్పులు, వలసలు, పాడిపంటలు, పరిశ్రమలు, శ్రామికుల వెతలు, కరువుకాటకాలు, దేశ స్వాంతంత్ర్యోద్యమం, ప్రపంచయుద్ధ బీభత్సం, తెలంగాణా రైతాంగ పోరాటం, శ్రీకాకుళ సాయుధపోరాటం, విప్లవోద్యమ తీరుతెన్నులు, స్త్రీవాద, దళిత, క్రైస్తవ, ముస్లిం మైనారిటీ వాదాలు- ఇలాంటి ఎన్నెన్నో విషయాల్ని సమీక్షపరిధిలోకి తీసుకోవాలి.

1872లో అచ్చయిన తొలినవల నరహరి గోపాలకృష్ణమసెట్టి 'శ్రీరంగరాజు చరిత్ర'తో ప్రారంభమైంది. సాహిత్యలోకంలో తొలి నవలగా ప్రచారంలో ఉన్న కందుకూరి వీరేశలింగం 'రాజశేఖర చరిత్ర' కంటే ఆరేళ్ల ముందుగా వచ్చిన నవల. ఆయన చెన్నపట్టణం వాసి.


Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

Compliments from
Sri Krishna Bhat
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
WOOD SIDE ANNEXE
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
WOODSIDE
HOTEL WOODSIDE
E.Car Street, Tirupathi. Ph : 2284464

# సర్వారాయ హరికథా కళాశాలలో 4 సంవత్సరాల్లో 10 కథలు చెప్పగలగాలి!

కళాపిపాసి, రాజకీయ నాయకుడూ జమీందార్ అయిన ఎస్.బి.పి.బి.కే సత్యనారాయణగారు సాహిత్యం, కళారంగం పట్ల అభిమానం కలవారు. మరాఠీవారిలో హరికథ ఉన్నప్పటికినీ, తెలుగులోనే బహుముఖంగా పోషింపబడింది. త్యాగరాజ ఉత్సవాల్లోనూ, దేవుని ఉత్సవాలలోనూ హరికథ లేనిచో సొగసు ఉండదు.

వీళ్లందరికీ ప్రత్యేక శిక్షణ యిచ్చే హరికథా విద్యాలయాన్ని నెలకొల్పితే ఎలా ఉంటుందని ఎస్.బి.పి. కె. సత్యనారాయణ గారికి కలిగిన సంకల్పమే శ్రీసర్వారాయ హరికథా పాఠశాల. ముఖ్యంగా బాలికలకే అవకాశం కల్పిస్తున్నారు. భద్రత, సౌభద్రత, సకల వసతీ వారే కూరుస్తూ – ఉపకార వేతనాల్ను యిస్తారు.

ఈ పాఠశాలలో పార్వతీ కల్యాణం, రుక్మిణీ కల్యాణం, సీతాకల్యాణం, వల్లీ కల్యాణం, శ్రీనివాస కల్యాణం వంటి కల్యాణ గాథల్నే కాక; భక్త మార్కండేయ, శ్రీరామజననం, సుగ్రీవ విజయం, ద్రౌపదీ మాన సంరక్షణము, పాదుకా పట్టాభిషేకం, భక్తకన్నప్ప, సతీతులసి, పద్మవ్యూహం, భక్తరామదాసు మొదలయిన కథలు నేర్పిస్తున్నారు. ఏ విధంగా చూసినా నాలుగు సంవత్సరాలలో పది కథలు ఇక్కడ నేర్చుకుంటారు. శిక్షణ విజయవంతంగా ముగించుకున్న విద్యార్థినులకు 'హరికథా గాన ప్రవీణ' సర్టిఫికేట్స్ అందచేస్తారు.

హరికథా బోధనతోపాటు ప్రదర్శనలో సభాకంపం (స్టేజి ఫియర్) పోగొట్టేందుకు వారానికోసారి ఆహూతుల సమక్షంలో హరికథా గానం చేయిస్తారు. మరుసటి రోజు దోషనిర్ధారణ చేసి నిర్మాణాత్మక విమర్శ ద్వారా ఉపాధ్యాయులు విలువైన సూచనలు, సలహాలు అందిస్తారు. సుప్రసిద్ధ హరిదాసుల చేత ప్రతినెల పాఠశాలలో 'ఆదర్శ కథాగానం' పేరిట కథలు చెప్పిస్తారు. ఇందువల్ల విద్యార్థినులు అవగాహన పెంచుకోవడానికి, వివిధ శైలులను పరిశీలించడానికి అవకాశం కలుగుతుంది. అంతే కాకుండా బయట ప్రాంతాలలో జరిగే హరికథా కార్యక్రమాలకు కూడా ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థినులను పంపిస్తారు.

### అంతర్జాతీయ గుర్తింపు

పాఠశాలను మరింత అభివృద్ధి దిశగా పయనింపజేసేందుకు వ్యవస్థాపకులు ఎస్.బి.పి.బి.కె. సత్యనారాయణరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. గాన కళాప్రపూర్ణ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల చేత సంస్కృత హరికథలను, సంపూర్ణ రామాయణ హరికథలను రాయించి, విద్యార్థినులకు వాటిలోనూ శిక్షణ ఇప్పించారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని కాళిదాస అకాడమీలో 1985లో ప్రప్రథమంగా 'కుమార సంభవం' హరికథను పాఠశాల విద్యార్థిని దాలిపర్తి ఉమామహేశ్వరి చెప్పి పండితుల మన్ననలను అందుకున్నారు. 'అభినవ మాతంగి' 'చిత్రకథా సరస్వతి', 'హరికథా గాన ప్రవీణ' వంటి బిరుదులను, ఎన్నో అవార్డులను కూడా ఆమె అందుకున్నారు. సంస్కృతంలో అభిజ్ఞాన శాకుంతలం, మాళవికాగ్నిమిత్రం, ఆది శంకరాచార్య, భక్తజయదేవ వంటి ఎన్నో హరికథలను ఈ పాఠశాల విద్యార్థినులు అవలీలగా ప్రదర్శిస్తారు.

### నృత్యంలోను...

హరికథా గానంతోపాటు రెండు వందల సంవత్సరాల క్రితం మునిలింగ కవి రచించిన దశావతార గీతాల ఆధారంగా రూపొందించిన నృత్య ప్రదర్శనలో ఈ పాఠశాల విద్యార్థినీ బృందం ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ప్రభుత్వం సంగీత కళాశాలలో హరికథను ఒక కోర్సుగా నడుపుతున్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువే! హరికథా పితామహుడు ఆదిభట్ల వారి ఆరాధనత్సోవాలుగా; 1979లో హరికథా సప్తాహాల్ను రాజమండ్రిలో ప్రప్రథమంగా నిర్వహించిన ఖ్యాతి ఈ పాఠశాలకే దక్కుతుంది.

### క్రీడలలోనూ...

విద్యార్థినులకు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కలిగించేందుకు ప్రత్యేక శ్రద్ధతో ఆటలను నేర్పించి పలు పోటీలకు యాజమాన్యం పంపిస్తూ ఉంటుంది. ఆటలలో కూడా ఇక్కడి విద్యార్థినులు పలు పతకాలను చేజిక్కించుకున్నారు. ఇదే కాకుండా బొమ్మల కొలువులు ఈ పాఠశాల మరో ప్రత్యేకత.

### అంతా ఉచితం

గురుకుల పద్ధతిలో నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో ఏటా 25 మందిని మాత్రమే చేర్చుకుంటారు. హరికథా బోధనకు, సాధనకు ప్రదర్శనకు 1976లో సర్వాంగ సుందరమైన స్వంత భవనం, మందిరాలు నిర్మించారు. బోధనోపకరణాలైన టి.వి., రేడియో, టేపు రికార్డర్లు, ఇతర ఆడియో, వీడియో పరికరాలు అధ్యయనానికి, పరిశోధనకు మంచి గ్రంథాలయం కూడా సమకూర్చారు. ప్రవేశం పొందిన విద్యార్థినులకు ఉచిత విద్య, వైద్యంతోపాటు 1906లో స్థాపించిన బులుసు రామలక్ష్మమ్మ అన్నసత్రంలో ఉచిత భోజనవసతి ఉంది. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థినులకు ఇంటిని మరిపించే ఆలనా, పాలనా, విద్యార్థినుల పుట్టిన రోజు వేడుకల్ను కూడా జరపడం ఈ పాఠశాల ప్రత్యేకత.

### మంచి అవకాశాలు

ఇప్పటికీ పాఠశాలలో సుమారు 150మంది భాగవతారిణులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. సుప్రసిద్ధ భాగవతారిణులుగా ప్రసిద్ధి చెందియున్నారు. డి. ఉమామహేశ్వరి, బాదంపూడి లక్ష్మీ, పెమ్మరాజు సావిత్రి, ఎం. సూర్యకుమారి, అల్లు వరలక్ష్మి, గొల్లపూడి కళ్యాణి, వంకాయలపాటి వీరవేణి, పురాణం విజయలక్ష్మి, వనుం అనూరాధ, మైలవరపు సూర్యకుమారి, సత్రే పద్మకుమారి, నాగమణి, వెంకటలక్ష్మి, భాషామణి, వై. శిఖామణి, బాలం, భారతి, పి. మునిలక్ష్మి ప్రభృతులు రేడియో, టీవి హరికథా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. జయంతి సావిత్రి టిటిడి భాగవతారిణిగా నియమితులయ్యారు. ఇదే క్రమంలో చాపర్ల రాజేశ్వరి, ఆవేటి విజయకుమారిలు టిటిడి ధర్మప్రచారపరిషత్‌లో అవకాశాలు పొందారు. ●


Trust No. F.No.6036/Date:14/10/98 Reg.No.MAH./9119/98 Date : 29/8/98

తెలుగు భాషాభివృద్ధి సార్వజనిక్ గ్రంథాలయం

तेलुगू भाषा अभिवृद्धी सार्वजनिक ग्रंथालयम्

TELUGU BHASHA ABHIVRUDHI SARVAJANIK GRANTHALAYAM

1193, NEW PACCHA PETH, SOLAPUR - 413006. (MAH.)

Dr. LAXMINARAYAN BOLLI
Founders President
Cell : 9850074141

| | | | | | |
|---|---|---|---|---|---|
| MALLIKARJUN KAMTAM | BALRAJU BOLLI | KANKAYYA JADAL | TIPPANNA GANERI | RAJENDRA YEMUL | SHRINIWAS YANAGANDUL |
| Chairman | Executive Chairman | Vice President | Secretary | Treasurer | Director |
| Cell : 9420489155 | Cell : 9422458628 | Cell : 9766895154 | Cell : 9326801811 | | Cell : 9850502540 |

## రాష్ట్రేతరాంధ్రుల శుభాశీస్సు

**శ్రీయుత గౌ॥ గోటేటి శ్రీరామారావుగార్కి,**

**సంపాదకులు,**

**ప్రముఖాంధ్ర, ప్రపంచ తెలుగుల మానస పత్రిక, చెన్నై**

**ఆర్యా!**

మన ప్రముఖాంధ్ర 22వ వార్షిక సం॥ అడుగిడిన సందర్భంగా 'తెలుగు భాషాభివృద్ధి' సార్వజనిక గ్రంథాలయం తరపున శుభాకాంక్షలు, మేమిక్కడ సోలాపూర్ పట్టణములో తెలుగు భాషా వికాసానికి తోడ్పడుతున్నాం. మీరు ఉచితంగా ప్రముఖాంధ్రను పంపిస్తున్నందులకు ప్రత్యేక ధన్యవాదాలు.

కార్యదర్శి

**జి. తిప్పణ్ణ**

తెలుగు భాషాభివృద్ధి సార్వజనిక్ గ్రంథాలయం,

సోలాపూర్ (మ.రా)

# దేశీయ పురావస్తు సంస్థకు 150 ఏళ్లు


ది ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా ను స్థాపించి 150 సంవత్సరాలైంది. పురావస్తు శాఖలో భారతీయ సంస్కృతి పరిరక్షణ కృషి శ్లాఘనీయం. ముఖ్యంగా పురావస్తు సాక్ష్యాలపై త్రవ్వకాలు, పురావస్తు కట్టడాల పరిరక్షణ, ఎపిగ్రఫీ, న్యూమిస్మాటిల్స్, నదీజలాల దిగువన పురావస్తు పరిశోధనలు, దేవాలయాల సర్వీసులు, మ్యూజియంల నిర్వహణ, ప్రచురణలు, లైబ్రరీల నిర్వహణ, పురాతన వస్తువులు పరిశోధన – ఇలా ఎన్నో ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు.

హరప్ప, జైన, బౌద్ధులు, స్థలాలను, స్థూపాలను, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, కోటలు, తమిళ్–బ్రాహ్మి వ్రాత ప్రతుల పరిరక్షణలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రముఖ పాత్ర వహిస్తూంది. రసాయన శాస్త్రశాఖ ద్వారా పురాతన కట్టడాలకు మెరుగులు,కట్టడాల వద్ద పూలతోటల పెంపకం చేస్తున్నది. న్యూఢిల్లీలోని ఆర్కియాలజీ సంస్థ రెండు సంవత్సరాల పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సును నిర్వహిస్తున్నది. ఎపిగ్రఫీ, న్యూమిస్ మాటిక్స్ దీనిలో బోధనాంశాలు, దీనిలో ప్రొఫెసర్లు కాంబోడియా, వియత్నామ్, అంగోలా, ఆఫ్ఘనిస్తాన్ పురాతన కట్టడాలపై పరిశోధన చేశారు. మానవవనరులు తక్కువగా వున్న సంస్థయైనా ప్రతిష్టాత్మకంగా పనిచేస్తుంది.

### జీర్ణోద్ధారణ

ఈ సంస్థలోని సిబ్బంది కె.కె. మొహ్మద్, సూపరింటెండింగ్ ఆర్కియాలజీ ఆధ్వర్యంలో 100 దేవాలయాలను కట్టడాలను 2005 నుండి పరిరక్షించింది. బాతేశ్వర్ శిథిలలకు మళ్లీ కొత్త శోభను తెచ్చింది. ఇప్పుడు 8, 9 శతాబ్దాల క్రితం నిర్మితమైనవాటికి జీర్ణోద్ధరణ చేసారంటే మాటలా? ఇప్పుడు డైరెక్టర్ జనరల్ బాధ్యత వహిస్తున్న గౌతంసేన్ గుప్తా పలు విషయాలను తెలియజేశారు.

మన భారతీయ సంస్కృతి పరిరక్షణలో గత 150 సంవత్సరాలుగా ఆర్కియాలజి కల్ సర్వే విశిష్ట కృషి చేస్తోంది. జీర్ణోద్ధార, పరిరక్షణ, పరిశోధనలలో నిమగ్నమైనది. ముఖ్యంగా త్రవ్వకాలు, ప్రచురణలు, విలువైన కట్టడాల భద్రతపై శ్రద్ధ వహిస్తుంది.




గత సంవత్సరాలలో పనిచేసిన పనులను సింహావలోకనం చేసుకుంటూ ముందుకు పయనిస్తున్నది.


### కంచెదాటితే

ఆయా రాష్ట్రప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో సంబంధాలు పెట్టుకొని ప్రాచీన కట్టడాల పరిరక్షణకు ఏఎస్ఐ విశేష కృషి చేస్తుంది. కేవలం వీటి పరిరక్షణా బాధ్యతను ప్రభుత్వం లేదా ఆర్కియాలజీపైననే వేయరాదు. స్వచ్ఛంధ సంస్థలు, స్థానిక ప్రజలు ఆయా ప్రాంతాల విలువైన చారిత్రక కట్టడాల పరిరక్షణకు పూనుకోవాలి. నేషనల్ మాన్యుమెంట్స్ అథారిటీ సంస్థను కేంద్ర ప్రభుత్వం చేపట్టనుంది. చారిత్రక ప్రసిద్ధిగల కట్టడాల చుట్టూ కంచె ఏర్పాటు చేసి, ఆవరణలో సంచరించేందుకు ఆంక్షలు విధించాలి.

### వరల్డ్ హెరిటేజ్ సైట్

ఈ మధ్యకాలంలో గనుల త్రవ్వకాలు పలుచోట్ల పెరిగాయి. కనీసం వందమీటర్ల దాకా ఎవ్వరినీ అనుమతించరాదు. మధ్య ప్రదేశ్ సాంచీ స్థూపం మూడవ శతాబ్దం నాటి పనులను 2004లో డిపార్ట్‌మెంట్ చేపట్టింది. సాంస్కృతిక శాఖ, రంగంలోకి దిగి పనులను వేగవంతం చేసింది. ఆ శాఖకు మానవ వనరుల శాఖ, ఇండియన్





నేషనల్ ట్రస్ట్‌ఫర్ ఆర్కియాలజీ హెరిటేజ్, ఆర్కియాలజీ ఎప్పటికప్పుడు సలహాలు ఇచ్చి సలహాలు యిస్తుంది.

తమిళనాడులోని తంజావూరు దేవాలయం, బృహదేశ్వర దేవాలయాలను ప్రపంచ హెరిజేట్ సైట్‌గా గుర్తించి పనులు వేగవంతంగా జరుగుచున్నాయి.

# తిరుమలలో వెయ్యికాళ్ల మండపం పడగొట్టబడినదేల?




**14 శతాబ్దిలో సాళువరాజు హయాంలో నిర్మాణమయినదీ వెయ్యికాళ్ళ మండపం**

**అప్పట్లో భక్తుల విశ్రాంతి మందిరం!**
**ఆ తర్వాత పవిత్రోత్సవాలకు వేదిక!**
**మహమ్మదీయుల పాలన తర్వాత వెలసిన గదులు!**
**కూల్చివేత నాటికి వ్యాపార సముదాయం!**
**పీవీకేఆర్ ప్రసాద్ హయాంలో సగం తొలగింపు**
**అజయ్‌కల్లం హయాంలో తొలగింపు సంపూర్ణం**
**అయినా.. భక్తుల మదిలో వెయ్యి కాళ్ళ మండపం సజీవం!**

సువిశాల ప్రాంగణం, అద్భుత శిల్పకళ... సుమారు ఏడు శతాబ్దాల చరిత్ర! తొలి రోజుల్లో భక్తులకు విశ్రాంతి మందిరం. ఆ తర్వాత పవిత్రోత్సవాలకు వేదిక. చివర్లో పలు సేవలకు నిలయం!! తిరుమలకు శోభాయమానం...భక్తుల మదిలో ఎప్పటికీ సజీవం!! అదే తిరుమలలోని వెయ్యికాళ్ల మండపం! కనుమరుగై పదేళ్లవుతున్నా ఇప్పటికీ ఇది చర్చనీయాంశమే! ఈ వెయ్యికాళ్ల మండపం ఎప్పటిది? దీనిని ఎవరు నిర్మించారు? ఎవరు కూల్చివేశారు. ఈ ప్రశ్నలు ఇప్పటికీ ఆసక్తికరమే.

తిరుమలలోని వెయ్యికాళ్ళ మండపాన్ని 14వ శతాబ్దిలో అప్పటి సాళువరాజు నిర్మించారు. అప్పట్లో ఆలయం చుట్టూ దట్టమైన అటవీ ప్రాంతం. స్వామి దర్శనానికి వచ్చే భక్తులు క్రూర జంతువులకు భయపడి రాత్రి వేళల్లో ఆలయంలోనే తలదాచుకునేవారు. దీంతో భక్తుల విశ్రాంతి కోసం వెయ్యికాళ్ల మండపాన్ని నిర్మించారు. శ్రీవారి ఆలయ ముఖ ద్వారం ఎదురుగా తూర్పు పడమరగా 250 అడుగులు, ఉత్తర– దక్షిణంగా 180 అడుగుల వెడల్పు, సుమారు 20 అడుగుల ఎత్తుతో నిర్మించిన సువిశాల మండపం. దీని స్తంభాల విషయమై ఖచ్చితమైన సంఖ్య అందుబాటులో లేకపోయినా... మండపం పొడవు, వెడల్పుల నేపథ్యంలో దీనికి వెయ్యికాళ్ల మండపంగా పేరు స్థిరపడింది. ప్రతి స్తంభం మీద అద్భుతమైన శిల్పకళ, సువిశాల ప్రాంగణంతో ఈ మండపం తిరుమలకు శోభాయమానంగా ఉండేది. మహమ్మదీయుల పాలనకు ముందు ఈ మండపంలో పవిత్రోత్సవాలు నిర్వహించేవారు. ఏడాది పొడవునా జరిగిన పూజా కైంకర్యాలలో జరిగిన లోపాలకు పరిహారంగా ఏటా పవిత్రోత్సవం నిర్వహించేవారు. ఈ విషయం ప్రస్తుతం శ్రీవారి పోటు గోడపై ఉన్న ఓ శిలాఫలకం తెలియజేస్తోంది. అయితే మహమ్మదీయుల పాలనలో తిరుమల అర్చకత్వం చేస్తున్న పలువురు అర్చకులు తిరుమల వదలి వెళ్లారని, అప్పట్లో మధ్వ అర్చకుడు వ్యాసరాయలు మాత్రం ఆలయంలోనే ఉండి పూజా కార్యక్రమాలు నిర్వహించేవారని శాసనాలు తెలియజేస్తున్నాయి. మధ్వ అర్చకునికి సంబంధించిన శిలాఫలకం కల్యాణోత్సవం నిర్వహించే మండపంలో ఉంది. కొన్ని దశాబ్దాల కిందటే, మండపంలో పవిత్రోత్సవాలు కూడా నిలిచి పోయాయి. అర్చకుల కొరత ఏర్పడిన క్రమంలోనే ఈ పవిత్రోత్సవాలు ఆగిపోయి ఉంటాయని పెద్దలు అభిప్రాయపడుతున్నారు. పవిత్రోత్సవాలు ఆగిపోయిన తర్వాత వెయ్యికాళ్ల మండపంలో ఇతర కార్యక్రమాలకు వినియోగించారు. స్తంభాల మధ్య గోడలు కట్టుకుని గదులుగా మార్చుకున్నారు. మండపాన్ని కూల్చేనాటికి అంటే 2003లో ఈ మండపంలో పోలీసుస్టేషన్, కళ్యాణకట్ట, చెవికి పోగులు కుట్టే గది, లడ్డూ రసీదు కౌంటర్, ఎలక్ట్రికల్ వస్తువులు నిల్వచేసుకునే గిడ్డంగి, పెద్ద సంఖ్యలో దుకాణాలు ఉండేవి.

**కూల్చివేత క్రమమిదీ..**

మండపంలోని రాతిస్తంభాలను 1920 నుండి తొలగిస్తూ వచ్చారు. అయితే మండపం కూల్చివేతపనులు మాత్రం 1980లోనే ఆరంభమయ్యాయి. ఆలయ ముఖద్వారానికి ఎదురుగా సన్నిధి వీధి ఉండేది. ఉత్తర, దక్షిణంగా రెండు భాగాల్లో వెయ్యి కాళ్లమండపం ఉండేది. 1980 నాటికి తిరుమలకు రద్దీ పెరగడంతో వీధిని వెడల్పు చేయడం అనివార్యమైందట. అప్పటి ఈవో పీవీఆర్‌కే ప్రసాద్ స్థానికులకు నచ్చచెప్పి సన్నిధి వీధిని వెడల్పు చేశారు. ఇందులో భాగంగానే వెయ్యి కాళ్ల మండపాన్ని ఉత్తర దక్షిణ దిశల్లో సగానికి తొలగించారు. దీంతో సన్నిధి వీధికి అటు ఇటు మండపం సగం మాత్రమే మిగిలింది. ఆ తర్వాత మరింతగా పెరిగిన భక్తుల సౌకర్యం కోసం అప్పటి ఈవో అజయ్‌కల్లం హయాంలో 2003లో వెయ్యికాళ్ల మండపాన్ని పూర్తిగా తొలగించారు. అప్పటికీ ఆలయ ముఖద్వారానికి వెయ్యికాళ్ల మండపానికి మధ్య సన్నటి రోడ్డు మాత్రమే ఉండటంతో బ్రహ్మోత్సవాల సమయంలో విపరీతమైన తొక్కిసలాట జరిగేదని – వెయ్యికాళ్ల మండపాన్ని పూర్తిగా తొలగించి ఆ స్థలాన్ని భక్తుల నిరీక్షణ కోసం కేటాయించారు. ప్రస్తుతం తిరుమల ఆలయం ముందు ఉన్న ఖాళీ స్థలం వెయ్యికాళ్ల మండపాన్ని తొలగించడంవల్ల ఏర్పడినదే! మండపం కూల్చివేసిన తర్వాత విరిగినవి పోగా మిగిలిన స్తంభాలు ప్రస్తుతం నారాయణ గిరి గార్డెన్, మొదటి ఘాట్‌రోడ్డు పరిసరాల్లో ఉన్నాయి.

**దేశీయ పురావస్తు శిల్ప కట్టడాలను మార్చనూరాదు, పడగొట్టనూ రాదు!**

తిరుమల శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న వెయ్యికాళ్ళ మండపమునెలా కూల్చారు? దేశీయ పురావస్తు శాఖ ప్రారంభించి 150 సంవత్సరాలయింది. అంటే సంబరపడుతున్నారు. 1980 సం॥ములో వేయికాళ్ల మండపాన్ని కొట్టి స్తంభాలను రాతివాసాలను పీకి యెక్కడో వనాల్లో పెట్టాం. మరో చోట కట్టడానికి వెయ్యికాళ్ల మండపం వాడుకుంటాం అనడం సమంజసమా?

తిరుమలకు పురావస్తుశాఖ 'రూలు' వర్తించదా? తిరుమల వెళ్లినప్పుడల్లా ఈ ప్రశ్న దహించివేస్తుంది. ఆలయం చుట్టూ ఉన్న సన్నిధి వీధులు కూడా పాత సౌరభాల్ని కోల్పోయాయి– అనే బాధ ఒకటీ; కొండల్ని పిండిచేసి నగరంగా తీర్చిదిద్దుతున్నారనే బాధ మరొకటీ బాధిస్తోంది. ●

**శ్రీ.వి. రావ్ పేజీ**

(గోటేటి వేంకటేశ్వరరావు)

నిరంతరం వెలిగే సూర్యుణ్ణి చూసి చీకటి భయపడుతుంది
అలాగే నిరంతరం శ్రమించేవాణ్ణి చూసి ఓటమి భయపడుతుంది.

- స్వామి వివేకానంద



# మా పెదనాన్నగారు గోపాలుని వేంకట నరసింహారావు గారి శతజయంతి 17-3-2016

## - నా సహస్రాధిక కృతజ్ఞతాంజలి

**(పెద్ద) నాన్నకు ప్రేమతో** అంటూ నా పినమామగారి పెద్దబ్బాయ్ గోపాలుని వెంకట రఘురామ్ నాకో వ్యాసాన్ని తీసుకొని వచ్చి ప్రముఖాంధ్రలో వేస్తే బాగుంటుందన్నాడు. పైగా ఇది మీ మావ గారి గురించి అన్నాడు. ఎనభై నాలుగు లక్షల జీవరాశుల్లో మానవజన్మ దుర్లభమైనది, ఉత్తమోత్తమమైనది. అనేక జన్మల పుణ్యపరిపక్వం వల్ల మానవ జన్మలభిస్తుంది. దాన్ని సార్థకం చేసుకున్నవారు మహాత్ములవుతారు. ధర్మం, సత్యం, భక్తి, విశ్వాసం ఇలా అనేక రూపాల్లో లక్ష్యం వుంటుంది. ఇవన్నీ మానవుడికి పరీక్షలే! దీన్ని నెగ్గినవారు ధన్యులు. ఈ లక్ష్యసాధన చేరుకునే సమయంలో బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం ఇలా గడుస్తూ పోతాయి. ఇవి అనివార్యాలు. ఇవి అనివార్యం అని తెలిసి తెలివిగా తానను కున్న లక్ష్యాన్ని ధర్మబద్ధంగా నెరవేర్చినవారు. ఇలా వందసంవత్సరాలైనా గుర్తుండిపోతారు. వారి గురించి మనం స్మరించుకుంటూ వుంటాం. అలాంటివారు జీర్ణమైన శరీరాన్ని వదిలినా చెక్కు చెదరని కీర్తితో ఇంకా జీవిస్తూ ఉంటారు. అటువంటివారే కీర్తిశేషులు శ్రీ గోపాలుని వెంకట నరసింహారావుగారు, మా మావగారు. అలా నేను ఓ 40 ఏళ్లు వెనక్కు వెళ్లాను. అప్పట్లో నేను చదువుకునే ప్రెస్‌కు సాయంత్రాలు వెళ్లి కూర్చునే వాడిని. మా మావగారు అదే గోపాలుని వెంకట నరసింహారావుగారు వారి తమ్ముడు కుమార్తె పెండ్లి శుభలేఖ అచ్చువేసే విషయమై మా ప్రెస్‌కు వచ్చారు. ఆ పత్రిక అచ్చుతప్పులు దిద్దేటపుడు, నన్ను పలకరించారు. అప్పటికి వారి అమ్మాయికి నేను అల్లుడవుతానని కానీ, ఆయన నాకు మావగారు అవుతారని కాని మా ఇరువురికి తెలియదు. నా పెళ్లి సమయంలో ఆయన లేరు. వారి ఐదుగురి సంతానంలో ఆఖరి అమ్మాయి నా భార్య లలిత. దేవుడు ఎలా ముడిపెట్టాడో చూశారా! అందుకే Marriages are made in Heaven అంటారు. వారిదో పెద్ద ప్రచురణ సంస్థ. మాదో ముద్రాపక సంస్థ. ఆయన శతజయంతి అనేసరికి నాకు తెలియని ఒక ఉద్వేగం ఫీల్ అయ్యాను. వారి అబ్బాయి నేను పాఠశాలలో చదువుకున్న చిన్ననాటి మిత్రులం. మేమిద్దరం ఇలా బావమరుదలవుతామని వాడికి నాకు తెలియదు.

ఆయనకు దేశాభిమానం ఎక్కువ. అందుకే 'జయభారత్ బుక్‌హౌస్' అని వారి సంస్థకు పేరు. మరి నా కేమో దేశం అంటే ఎనలేని గౌరవం. ఆయన అన్నదమ్ముల్లా మా అన్నదమ్ములు ఒకరంటే ఒకరికి గౌరవం, ప్రేమాభిమానాలెక్కువ. వారిది ఉమ్మడి కుటుంబం. మాది ఉమ్మడి కుటుంబం. అందుకే మా ఇంటి పెద్దవాడనయిన నాకు ఆ ఇంటి చిన్న అమ్మాయికి ఇలా జోడి కలిపేశారు. ఇక కీర్తిశేషులు గోపాలుని వెంకట నరసింహారావు గారి గురించి వెంకటరఘురాం మాటల్లోనే...

**- గోటేటి వెంకటేశ్వరరావు**

**మా** పెద్దనాన్నగారు కీర్తిశేషులు శ్రీ గోపాలుని వెంకట నరసింహారావు గారు ఆంగ్ల ఉపవాచక పుస్తక ప్రచురణలో మద్రాసులోని పేరెన్నికగన్న మేక్‌మిలన్, ఓరియంట్ లాంగ్‌మాన్ వంటి సంస్థలతో పోటీగా జయభారత్ బుక్‌హౌస్‌ని స్థాపించి అనతి కాలంలోనే పెద్ద సంస్థగా నెంబర్‌వన్‌గా నిలిపారు అంటే అతిశయోక్తికాదు.

వారు ఆంధ్రప్రదేశ్‌లో నాటి నెల్లూరు ప్రస్తుత ప్రకాశం జిల్లాలోని కురిచేడు మండలంలోని దరిసి తాలూకా, దొనకొండ రైల్వేస్టేషన్‌కు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో వున్న పెద్ద గుడిపాడు గ్రామంలో గోపాలుని రఘురామయ్య గారి జ్యేష్ఠ సంతానంగా 17-3-1916లో జన్మించారు. ఆయనతోపాటు ఒక అక్క, చెల్లెలు, సుబ్బారావు అనే తమ్ముడు ఆ కుటుంబంలో జన్మించారు. ఆ గుడిపాడు గ్రామం నేటికి పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇంకా ఏ మాత్రం అభివృద్ధి లేకుండానే వున్నది. మా పెద్దనాన్నగారి కుటుంబం చాలా పేద కుటుంబం. మా పెద్దనాన్న నరసింహారావుగారు గుడిపాడులో పాఠశాల లేనందువల్ల ప్రాథమిక విద్యను దొనకొండలోను, గుంటూరు హిందూ హైస్కూలులో ఎస్.ఎస్.ఎల్.సి. ని ముగించారు. పేదరికం వల్ల తను చదువును కొనసాగించలేక, చదువుకు స్వస్తి చెప్పి తమ దూరపు బంధువైన శ్రీ ఈదర వెంకట్రావు పంతులుగారి వెంకట్రామ అండ్ కంపెనీలో గుమస్తాగా ఉద్యోగములో చేరారు. ఆ చాలీచాలని జీతంతోనే తండ్రిని, తమ్ముణ్ణి పోషిస్తూ తమ్ముడిని అదే హిందూ హైస్కూలులో ఎస్.ఎస్.ఎల్.సి. వరకు చదివించి ఇంట్లోని ఆర్థిక పరిస్థితుల వలన తమ్ముడిని కూడా అదే వెంకట్రామ అండ్ కంపెనీలో తనతోపాటు ఉద్యోగంలో చేర్పించారు.

తరువాత ఆయనను వెంకట్రామ అండ్ కంపెనీవారు విజయవాడ నుండి హైదరాబాదుకు బదిలీ చెయ్యడం అక్కడ వాతావరణం, నీరు ఆయనకు పడక వెంకట్రామ అండ్ కంపెనీ పంతులుగారిని అభ్యర్థించి మరలా విజయవాడకు బదిలీ చెయ్యమని అడుగగా వారు మద్రాసుకు వెళ్లమని



చెప్పారు. అది ఆయనకు తిరుగులేని మలుపుగా ఆయన ప్రస్థానము మొదలైనది. సుమారు ఇరవై సంవత్సరములు వెంకట్రామ అండ్ కంపెనీలో పనిచేసిన అనుభవంతో ఆయన ఒక పుస్తక కంపెనీని స్వంతంగా స్థాపించాలని తలంచి 1953లో జయభారత్ పబ్లిషింగ్ హౌస్ అనే సంస్థను జార్జిటవున్‌లోని నెం 12 ఫ్రాన్సిస్ జోసెఫ్ వీధిలో, బ్రాడ్వే ప్రక్కన తన వ్యాపారాన్ని ప్రారంభించారు. ఆయన చదువుకున్నది ఎస్.ఎస్.ఎల్.సి. అయినా ఆంగ్లభాషలో అనర్గళమైన ప్రతిభాపాటవాలు వుండేవి. మంచి ప్రావీణత ఉండేది. తనకు జీవనోపాధి కల్పించిన వెంకట్రామ అండ్‌కో సంస్థకు పోటీగా భావించకూడదనే సదుద్దేశంతో తెలుగు పుస్తకాలను ప్రచురించకుండా ఇంగ్లీషు ఉపవాచకములను పెద్ద పెద్ద రచయితలచే వ్రాయించి, వాటిని ముద్రించి ప్రచురించి పేరు ప్రఖ్యాతులను సంపాదించారు. జయభారత్ బుక్‌హౌస్‌ను ఒక పేరెన్నికగన్న సంస్థగా నిలిపారు.

ఆ సంస్థ నుండి బెన్‌హర్, ప్రిసనర్ టు ప్రైమినిస్టర్ (పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జీవిత చరిత్ర), స్టోరీస్ ఆఫ్ నోబల్ కేరక్టర్, స్టోరీస్ ఫ్రమ్ అవర్ షేక్స్‌ఫియర్, ది త్రీ మస్కిటీర్స్, సెవన్ వండర్స్ ఆఫ్ ద వరల్డ్, ది టాలీస్‌మేన్, స్టోరీస్ ఆఫ్ రైట్ కాండక్ట్– సీనియర్, జూనియర్ ఫెయిరీటేల్స్ మొదలైన పుస్తకాలను వెలువరించారు. ఆయన సంస్థ పుస్తకాలను ఆంధ్ర, కర్ణాటక, కేరళ, ఒరిస్సా, తమిళనాడు పాఠశాలలలో పాఠ్యాంశములుగా చేర్చబడ్డాయి.

ఆయన పుస్తకములు ముఖ్యముగా స్టోరీస్ ఆఫ్ నోబుల్ కేరక్టర్, స్టోరీస్ ఫ్రం వర్స్. ఇవన్నీ నీతికథలే. అలాగే ప్రాథమిక పాఠశాలల పిల్లలకు నీతిని బోధించాలని అక్బర్, బీర్బల్, పరోపకారి వంటి కథలు అనే రెండు పుస్తకాలు ప్రచురించారు. ఆ రోజులలో ప్రతి సంవత్సరము ఈ పుస్తకాలు లక్ష కాపీలకు తక్కువ గాకుండా అమ్మేవారు కారు. మాతృభాషాభిమానంతో ఆయన వెలువరించిన ఒకే ఒక్క పుస్తకం కుమార విజయం. ప్రతి సంవత్సరం జూలై 17న ఆయనకు కలిసొచ్చిన రోజు. ఆ రోజే కర్ణాటక ప్రభుత్వం టెక్స్టుబుక్ కమిటీవారు పుస్తకాలను ఎంపిక చేసేవారు. ఆయన ప్రతి సంవత్సరం ఏప్రియల్ నుండి జూన్ వరకు ఈ పుస్తకాలు వాటిని ముద్రించటం, వాటిని అన్ని పబ్లిషర్స్‌కు పంపించటం కోసం రాత్రింబవళ్లు శ్రమపడేవారు.

ఆయన తమ్ముడు గోపాలుని వెంకట సుబ్బారావు (మా నాన్నగారు) పటేల్ వాల్ కార్టు అనే సంస్థలో పనిచేస్తూ రోజూ సాయంత్రం ఈ బుక్‌హౌస్‌కు చేరుకుని అన్నయ్యకు అన్ని విధాలా సహకరించేవారు. పిల్లల పాఠ్యాంశాల పుస్తకాలు అప్పుడు మద్రాసు టెక్స్టుబుక్ సొసైటి 1973లో జాతీయం చేయగా ఆయన ఆ పుస్తక కంపెనీకి స్వస్తిచెప్పారు. సరిగ్గా తరువాత ఆరు సంవత్సరాలకు 1979 ఆగస్టు 16వ తేదీని శ్రీవెంకటేశ్వరుని సన్నిధికి చేరుకున్నారు.

ఆయన తన పిల్లలతో సమానంగా తన తమ్ముడు పిల్లలను తన పిల్లలు గానే భావించి పెంచి పెద్దచేశారు. అందువల్లే ఈ రెండు కుటుంబాలు నేటికి ఒకే కుటుంబంగా ప్రక్కప్రక్కనే అన్యోన్యంగా జీవిస్తున్నారు. ఈ రోజు ఈ రెండు కుటుంబాలలోని పిల్లలందరూ ఉన్నత స్థాయిలో వుంటూ చెన్నై లోనే స్థిరనివాసమేర్పరచుకున్నారు. ఆయన శ్రీమతి లక్ష్మీకాంతంగారు 92 ఏళ్ల వయస్సులో ఇద్దరు కుమారుల వద్ద వుంటూ సుఖజీవనం సాగిస్తున్నారు.

మా పెద్దనాన్నగారి ఇద్దరు కుమారులు రామచంద్రమూర్తి, రాంగోపాల్, కూతుర్లు విజయలక్ష్మి, పద్మావతి, లలిత వారి కుటుంబాలతో చెన్నైలోనే వుంటున్నారు.

ఇంకో ముఖ్య విషయం ఏవిటంటే 'ప్రముఖాంధ్ర' సంపాదకులు శ్రీగోటేటి శ్రీరామారావుగారు ఆయన వియ్యంకులు. వారి అబ్బాయి ప్రముఖాంధ్ర సహ సంపాదకుడు, గోటేటి గ్రాఫిక్స్ ముద్రణాలయ అధినేత గోటేటి వెంకటేశ్వరరావు మా పెద్దనాన్నగారు శ్రీగోపాలుని నరసింహారావుగారి మూడవ అల్లుడు.

శ్రీనరసింహారావుగారికి దేశభక్తి మెండు. అందువల్లనే ఆయన తన సంస్థకు 'జయభారత్ బుక్ హౌస్' అని నామకరణం చేసారు. మా సుబ్రహ్మణ్య నగర్ కాలనీ వాసులు ప్రతి ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు తప్పక హాజరయ్యేవారు. 1979 ఆగస్టు 15న కూడా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొని ఆ మరుసటి రోజు ఆగస్టు 16న స్వర్గస్థులైనారు.

అంతేకాదు వారి కులదైవం శ్రీవేంకటేశ్వరస్వామి అంటే ఎనలేని భక్తి అందుకే ఆయన పిల్లలు, తమ్ముడి పిల్లలు ఆడ మగ అందరికి ఇంటిపేరు గోపాలుని తరువాత వెంకట అని కలిపి తరువాత వారి వారి పేరులను పెట్టారు. అలాగే 50 సంవత్సరాల క్రితమే శ్రీనరసింహారావు వారి తమ్ముడు సుబ్బారావుగారితో కలిసి తిరుమలలో 'సుదర్శన్ విడిది'లో ఒక గదికి విరాళం ఇచ్చారు. ఇప్పటికి సుదర్శన విడిదిలోని 126వ గదికి శిలాఫలకములో వారి తల్లిదండ్రులు శ్రీమతి సుందరమ్మ, శ్రీ రఘురామయ్య గార్ల జ్ఞాపకార్థంగా దాతలు గోపాలుని వెంకటనరసింహారావు, గోపాలుని వెంకట సుబ్బారావు అని వ్రాసి యుంటుంది మీరు చూడవచ్చు. అంతటి విశాలహృదయులు, దేశభక్తులు కుటుంబం పట్ల అనన్య ప్రేమాభిమానాలు గల మా పెద్దనాన్నగారు శ్రీగోపాలుని వెంకటనరసింహారావు గారు 17–3–2016న వారి 100వ సంవత్సరము జయంతి సందర్భంగా ఆయన్ని ఈ విధంగా శతజయంతిలో వారి గుణగణాలను కీర్తిస్తూ నేను రాసిన ఈ వ్యాసాన్ని మా బావగారికి అందించి ప్రముఖాంధ్రలో ప్రచురించాలని అడగడం, వారు సంతోషంగా అంగీకరిండం నాకు ఎనలేని ఆనందాన్ని కలిగించింది.

– శ్రీగోపాలుని వెంకట రఘురాం



అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ
మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్ధ, వృద్ధ భారాన్ని మోస్తూనే
అ ఆ
254 నెలలుగా
254 సంచికలను
శ్రీ వేంకటేశ చరణౌ చరణం ప్రపద్యే।
ప్రముఖాంధ్ర
- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల టేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!
'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.10000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)
గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు
చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
March 2016

REGN. No. TN/CC(S)DN/177/15-17
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97




GOTETI GRAPHICS

FOR COMPLETE PRINTING SOLUTIONS

- Offset printing
- Desk top publishing
- Prepress
- Postpress

Office : #64 (#16), Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. INDIA. ☎ 91-44-2474 2091
Telefax : 91-44-23716322 e-mail : gotetigraphics@gmail.com